ప్రజాశక్తి
గురువారం 31 ఆగస్టు 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

విద్యాశాఖలో బ్లాక్ మార్కెట్

అడ్డగోలుగా టీచర్ల సిఫార్సు బదిలీలు - నేతలకు లక్షల్లో ముడుపులు



ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌లో ఖాళీలు చూపించకుండా బ్లాక్ చేసిన పోస్టులకు ఇప్పుడు పెద్ద ఎత్తున సిఫార్సు బదిలీలు జరుతున్నాయి. గత వారం రోజులుగా ఈ బదిలీలు ఊపందుకున్నాయి. ప్రతిరోజూ ఒకటి రెండు బదిలీలు జరుగుతూనే ఉన్నాయి. ఉపాధ్యాయులకు సంబంధించి అనేక ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నా బదిలీలు మాత్రం ఆఘమేఘాలపై జరిపోతున్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు ఇప్పటి దాకా 25 మందికి సిఫార్సు బదిలీలు చేసినట్లు సమాచారం. తాడికొండ, నంబూరు, తెనాలి, మేడికొండరూ, కొల్లిపర మండలాల్లో ఆయా ఉపాధ్యాయులు చేరినట్లు తెలిసింది. కాగా వీటి కోసం డబ్బులు పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయని ఉపాధ్యాయుల్లో ప్రచారమవుతోంది. ఒక్కొక్క పోస్టుకు రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలు కూడా సమర్పించుకుంటున్నారు. నేరుగా మంత్రుల నుండే ఉత్తర్వులు తెచ్చుకుంటున్నారు. గతంలో ఈ విధమైన బదిలీల కోసం ఎక్కువ రోజుల సమయం పట్టేదని, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఉదయం వెళ్లి కలిసి డబ్బులు కడితే రెండ్రోజుల్లో పోస్టింగ్ ఇస్తున్నారని అనుకుంటున్నారు. అటువంటి ఉపాధ్యాయులకు అధికారులు కూడా రెడ్‌కార్పెట్ వేసి మరీ కోరుకున్న స్థానాల్లో పోస్టింగ్ ఇస్తున్నారనే విమర్శలున్నాయి. అక్రమంగా బదిలీలు పొందిన వారు డిఇఒ కార్యాలయంలోనే తమ ఆనందాన్ని మిఠాయిలు పంచుకొని వ్యక్తం చేసుకుంటున్నారు.

రెండ్రోజుల క్రితం వట్టిచెరుకూరు మండలంలో ఒక చోటకు ఏడుగురు ఉపాధ్యాయులకు సిఫార్సు లేఖలు వచ్చాయి. దీంతో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలో తేల్చలేకపోతున్నారు. ఇటీవల ఉపాధ్యాయులకు బదిలీల కౌన్సెలింగ్ అయిన తర్వాత ఖాళీలలో ఎంటిఎస్ ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు సిఫార్సు బదిలీల్లో అవసరమైతే ఎంటిఎస్ ఉపాధ్యాయులనూ పక్కన పెట్టి రెగ్యులర్ టీచర్లకు పోస్టింగ్స్ ఇస్తున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. అదే విధంగా కౌన్సెలింగ్‌లో దూర ప్రాంతాలకు బదిలీ అయిన వారు సైతం కొందరు ఇప్పుడు జిల్లా కేంద్రం చుట్టుపక్కన పోస్టింగ్ తెచ్చుకుంటున్నారు. ఇంత అడ్డగోలుగా గతంలో ఎప్పుడూ లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచే విధంగా రాజకీయ బదిలీలు చేస్తున్న విధానాన్ని ఉపాధ్యాయ సంఘాలు తప్పుబడుతున్నాయి.

తక్షణమే ఆపాలి



సిఫార్సు బదిలీలు తక్షణమే ఆపాలి. ప్రభుత్వం కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచి, కొంత మంది కోసం వేలాది మంది ఉపాధ్యాయులను మోసం చేయటం తగదు. ఈ బదిలీల పట్ల ఉపాధ్యాయుల్లో పెద్ద ఎత్తున ఆందోళన నెలకొంది. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు ఇప్పటికైనా స్వస్థి పలకకుంటే ఆందోళనకు పూనుకుంటాం.

ఎం.కళాధర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

వార్తలు 4, 5 పేజీల్లో



తాడేపల్లిలో ప్రచారం చేస్తున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, తదితరులు

ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం సమరభేరీ



అమరావతిలో ప్రచారం చేస్తున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రవిబాబు తదితరులు

తుదిదశకు ఓటర్ల సర్వే

- పలు నియోజకవర్గాలపై టిడిపి ఫిర్యాదులు
- రాజధాని గ్రామాలపై వైసిపి దృష్టి



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్, కమిషనర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో ఓటర్లజాబితాల పరిశీలన, సవరణ ప్రక్రియ తుది దశకు చేరింది. అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. బిఎల్ఓ (బూత్ లెవల్ అధికారి) స్థాయిలో జాబితాల్లోమార్పులు, చేర్పులపై చేపట్టిన సర్వేపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి పోలింగ్ కేంద్రంపరిధిలో కొన్ని ప్రాంతాలను నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి తప్పనిసరిగా పరిశీలన చేయాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఈమేరకు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఇప్పటికే తాడికొండ, ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. తొలగించిన ఓటర్లు, ద్వంద్వ ఓటర్లు, డెత్ కేసులు, క్రొత్త ఓటర్ల నమోదు వివరాలను జిల్లా కలెక్టర్ ఇంటింటికి వెళ్లి ఆకస్మికంగా పరిశీలన చేశారు.

తొలి విడత గత నెల 21 నుంచి ఈనెల 21 వరకు బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేశారు. చనిపోయిన, స్థానికంగా ఉండని, వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నపేర్లను నమోదు చేశారు. చనిపోయిన వారి పేర్లు తొలగించే ప్రక్రియలో తప్పని సరిగా కుటుంబ సభ్యుల నుంచి రాతపూర్వకంగా వివరాలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించింది. అలాగే ఒక చోట నుంచి మరో చోటకు మారిన వారిని, స్థానికంగా నివాసం ఉండని వారిని గుర్తించారు. ఒక వ్యక్తి రెండు మూడుచోట్ల పేర్లుంటే వాటిని కూడా గుర్తించారు. ఎవరు స్థానికంగా ఉన్నారు? ఎవరు ఉండటం లేదు. ఆధార్ చిరునామా స్థానికంగా ఉందా లేదాపరిశీలన చేపట్టారు. రాజధాని ప్రాంతంలో టిడిపి సానుభూతి పరులు ఎక్కువగా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్నా 29 గ్రామాల్లో ఓటర్లుగా ఉన్నారని వైసిపి నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది.

ఆగస్టు 22నుంచి సెప్టెంబరు 29 వరకు పోలింగ్ ▶ 2లో

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలెక్టరేట్‌ల ఎదుట నిరసనలు - అధికారులకు వినతిపత్రాలు 2 లో

కౌలు రైతులందరికీ కార్డులు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు నిర్దేశిత లక్ష్యాల మేరకు అందించేలా రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ జీఈఆర్, హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ చట్టం, వ్యవసాయ శాఖ , పశు సంవర్ధక ▶ 2లో

తల్లికి నివాళిగా ప్రతిఏటా కుటుంబం రక్తదానం

2లో

సర్వేపల్లి పురస్కారానికి శ్రీనివాస్‌రెడ్డి ఎంపిక

ప్రజాశక్తి - పెదకూరపాడు



మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డికి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణలోని నల్గొండకు చెందిన చెందిన 'పుడమి సాహితీ వేదిక' డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక జాతీయ పురస్కారాన్ని ఇస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. విద్యారంగంలో 27 ఏళ్లుగా విశిష్ట కషి చేస్తున్నందుకు శ్రీనివాసరెడ్డికి ఈ పురస్కారాన్ని ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 3న నల్లగొండలో జరిగే ఒక కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డికి పీసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధానోపాధ్యాయ సంఘ అధ్యక్షులు ఎ.తిరుమలేష్, ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య శుభాకాంక్షలు తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉపాధ్యాయులు తమ బోధించే సబ్జెక్టులో నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని పెదకూరపాడు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం కాకాని వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయుల కార్యదర్శి నాగరాజు అన్నారు. బుధవారం పెదకూరపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి లెక్కలు సబ్జెక్టు, వ్యాయామ ఉపాధ్యాయులకు, తాళ్లూరు జెడ్‌పి పాఠశాలలో తెలుగు భాష పై కాంప్లెక్స్ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ నిరంతరం ఆధునిక సాంకేతికతను సబ్జెక్టుకి ఉపయోగించి విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించే విధానంపై అవగాహన కల్పించారు.

క్షతగాత్రునికి శ్రీధర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని మాచయపాలేనికి చెందిన జువ్వలేరి వెంకట్రావు చెయ్యి విరగడంతో ఆ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ రూ.20 వేలను బుధవారం అందించారు. నాలుగు రోజుల వెంకట్రావు యథావిధిగా ట్రాక్టర్‌తో పొలం పనులు చేస్తుండగా రోటవేటర్‌లో ఇరుక్కున్న మట్టిని చేయిపెట్టి తీస్తుండగా ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకెళ్లడంతో రోటవేటర్ తిరగి వెంకట్రావు చెయ్యి నుజ్జయ్యింది. గుంటూరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన్ను శ్రీధర్ పరామర్శించారు. అధైర్య పడొద్దని, అవసరమైతే పూర్తిగా నయమయ్యే వరకూ ఖర్చులన్నీ భరిస్తామని ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో మాట్లాడి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. పరామర్శించిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ, నాయకులు మస్తాన్ షరీఫ్, సాంబశివరావు, చెన్నయ్య పూర్ణయ్య, లచ్చింకోటి ఉన్నారు. ఇదిలా ఉండగా చంద్రాజుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన యువతి వివాహానికి టిడిపి బిసి సెల్ మండల అధ్యక్షులు గుంజా గంగారావు రూ.5వేల సాయం అందించారు. ఆయనవెంట కె.ప్రసాద్, రాంబాబు, శివ, దయానంద, ఏసుబాల ఉన్నారు.

ఎఎంజి పాఠశాలకు రాష్ట్రస్థాయి క్రీడా ప్రతిభ అవార్డు

ప్రకాశక్తి - చిలకలూరిపేట : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడ ప్రతిభ అవార్డులకు ఎంపిక చేసినట్లు ఎఎంజి స్కూల్ హెచ్‌ఎం కె.కృపానందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సర్కిల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో అత్యధిక పథకాలు సాధించి మొదటి ఐదు స్థానాలు నిలిచిన పాఠశాలలకు ఈ అవార్డులు ఎంపిక చేశారని చెప్పారు. ఈ పోటీల్లో ఏఎంజీ పాఠశాల 496 పాయింట్లు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో, పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. అవార్డును నరసరావుపేట పట్టణంలోని టౌన్ హాల్లో జరిగిన స్కూల్ స్పోర్ట్స్ ఎక్సలెన్సు కార్యక్రమంలో కలెక్టర్ అవార్డులను కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డీఈవో శామ్యూల్, డిప్యూటీ డిఇఓ వేణుగోపాలరావు నుండి అవార్డులు పొందినట్లు పేర్కొన్నారు. అవార్డులకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.రాజు, రాజేష్‌ను ఇంటర్నేషనల్ డైరెక్టర్ అరుణ్ కుమార్ మహంతి సీఏఓ మాశల మణి, సర్కిల్ గేమ్స్ కార్యదర్శి కె.కోటేశ్వరరావు అభినందించారు.

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలెక్టరేట్‌ల ఎదుట నిరసనలు - అధికారులకు వినతిపత్రాలు



పల్నాడు కలెక్టరేట్ ఎదుట విఆర్‌ఎల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

విఆర్‌ఎల పట్ల ప్రభుత్వ నిర్బధ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం విఆర్‌ఎలు గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల వద్ద నిరసనలు తెలిపారు. అనంతర గుంటూరులో కలెక్టరేట్ ఏవోకు, నరసరావుపేటలో జెసి ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రాలిచ్చారు. విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.నాగూల్‌మీరా, పల్నాడు జిల్లా అధ్యక్షులు బందగీసాహెబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 25న విజయవాడలో విఆర్‌ఎల ధర్నాకు తొలుత అనుమతిచ్చి, విఆర్‌ఎలు విజయవాడ చేరుకున్నాక, అనుమతి రద్దు చేయటం దుర్మార్గమన్నారు. రాష్ట్రప్రభుత్వం విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, గత ప్రభుత్వం ఇచ్చిన డిఎను కూడా రద్దు చేసి, విఆర్‌ఎను మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం నోటికి వచ్చిన వాగ్దానాలన్నీ చేసి, తర్వాత నాలుక కరుచుకోవటం పాలకులకు అలవాటైందని విమర్శించారు. సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించటానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. అధికారాన్ని ఉపయోగించి, ప్రజల్ని నిర్బంధించాలని చూసిన అనేక ప్రభుత్వాలకు గతంలో బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. వీఆర్ఏలను అర్ధరాత్రి అరెస్టులు చేయడం, బస్టాండు, రైల్వే స్టేషన్, విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద విఆర్‌ఏలను పెద్ద ఎత్తున అరెస్టులు చేయడం దారుణమన్నారు. వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వీఆర్ఏలకు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమాల్లో సురేష్, జమీర్, సాంబయ్య, సిద్ధయ్య, సుబ్బారావు, కె.రోశయ్య, ఆనంద్, నాగేశ్వరరావు, షేక్ కాసులు, షేక్ ముస్తఫా, విఆర్‌ఎలు పాల్గొన్నారు.



గుంటూరు కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఎలు



ప్రజాశక్తి - యడ్లపాడు

ఆన్‌లైన్ చేయాల్సిన 1977 ఓటర్ల నమోదును వారంలోగా పూర్తి చేయాలని సిబ్బందిని సహాయ ఎన్నికల అధికారి, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ జి.సుజాత ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై బీఎల్వోలతో యడ్లపాడులోని సచివాలయం-1లో బుధవారం సమీక్షించారు. ఇంటింటి పరిశీలన పూర్తయిందని, 57 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 44,192 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 21,450 మంది ఉండగా, 22,742 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియలో భాగంగా గుర్తించి 4,197 వివిధ రకాల క్లయిమ్‌లను వేగవంతంగా పున:పరిశీలన చేయాలని సూచించారు.. ఓటర్ల తుది జాబితాలో తప్పుల్లేకుండా చూడాలన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

జిల్లా మలేరియా అధికారి రవిరత్నాకర్ మాచర్ల మండలం ఏడో మైలు గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాలలో దోమలు లార్వా నిల్వ లేకుండా చేయటం, దోమల వ్యాప్తిని అరికట్టడం గురించి అవగాహన కల్పించారు. అనంతరం మలేరియా, డెంగీ వ్యాధుల రాకుండా పాటించాల్సిన జాగ్రత్తల గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏడో మైలులోని చెంచుకాలనీ గృహాల్లో వాడుతున్న దోమతెరలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చార్లెస్ వెస్లీ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, సూపర్వైజర్ నాగేశ్వరావు, పాల్గొన్నారు.



తుదిదశకు ఓటర్ల సర్వే

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం స్థాయిలో జాబితాల పరిశీలన, ఓటర్ల ఫోటోల ముద్రణ జరుగుతోంది. ఈ పరిశీలనలో రాజకీయ వత్తిడిలకు తలొగ్గి తప్పులు చేస్తే మీరే బాధ్యులని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి హెచ్చరించారు. తాడికొండ నియోజకవర్గంలో టిడిపి ఓట్లను తొలగించారని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టరు పలుమార్లు ఈ నియోజకవర్గంలో పర్యటించి పరిశీలన చేశారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి విచారించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కూడా జిల్లాలోని పలు గ్రామాలకు వెళ్లి బిఎల్‌ఓల పనితీరుపై పరిశీలన చేశారు. ఎక్కడా విమర్శలకు తావులేకుండా పనిచేయాలని అధికారులకు హెచ్చరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలపై ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిశితపరిశీలన చేస్తున్నాయి. ఓటర్ల జాబితాల్లో పేర్లు తొలగింపుపై టిడిపి,వైసిపి నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. టిడిపి హయంలో ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల పేర్లు చేర్పించడం వల్ల వాటిని తొలగిస్తున్నామని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. అయితే టిడిపి ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. టిడిపి,వైసిపి ఇప్పటికే పరస్పరం ఎన్నికల కమిషన్‌కు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు పంపారు.

తల్లికి నివాళిగా ప్రతిఏటా కుటుంబం రక్తదానం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మెదడు నరాలు దెబ్బతిని, సమయానికి రక్తం అందక మరణించిన చెందిన తల్లికి నివాళిగా ఎనిమిదేళ్ల నుండి రక్తదానం చేస్తున్న కుటుంబీకులు బుధవారమూ రక్తదానం చేశారు. మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన కృష్ణా జిల్లాలో జడ్జిగా పని చేస్తున్న సరికొండ చినబాబు, ఆయన సోదరుడు, అధ్యాపకులు లెనిన్‌బాబు, మేనల్లుడు కూరపాటి శివరామరాజు, సమీప బంధువు, దంత వైద్య నిపుణులు సంపత్ ఇతర కుటుంబ సభ్యులు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పనసతోటలో గల పల్నాడు బ్లడ్ బ్యాంక్‌లో బుధవారం రక్తదానం చేశారు. జడ్జి చినబాబు మాట్లాడుతూ రక్తం అందక ఎవరూ మృతి చెందకూడదనే సంకల్పంతో తమ తల్లి లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా తమతో పాటు తమకు తెలిసిన వారితో రక్త దానం చేయిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది సత్తెనపల్లి, విజయవాడ ప్రాంతాల్లో రక్త దానం చేస్తామని, ఇప్పుడు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ సూచన మేరకు తమ ప్రాంతమైన నరసరావుపేటలో చేశామని చెప్పారు. కార్యక్రమంలో చినబాబు భార్య అయిన జడ్జి పద్మ, కుటుంబీకులు పాల్గొన్నారు.



రక్తదానం చేసేందుకు వచ్చిన కుటుంబీకులు, బంధువులు

రక్త దానం పట్ల అపోహలు వీడాలి : బ్లడ్ బ్యాంక్ అధినేత కె.జానకిరామయ్య

లేనిపోని అపోహల వీడి రక్తదానానికి ముందుకు రావడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోయాలని పలనాడు బ్లడ్ బ్యాంక్ అధినేత కె.జానకి రామయ్య అన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేస్తే వారికి, వారి కుటుంబ సభ్యులకు, తెలిసిన వారికి అవసరమైన సమయంలో తమ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచితంగా రక్తం సరఫరా చేస్తామన్నారు. ఇదే కాకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి తమ బ్లడ్ బ్యాంక్ తరఫున రూ.5 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

కౌలు రైతులందరికీ కార్డులు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

శాఖ, గడప గడపకు మన ప్రభుత్వ, జగనన్నకు చెబుదాం అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎఇఒలు, పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఐదు నుండి పదేళ్ల వయస్సు ఉన్న విద్యార్థులందరూ పాఠశాల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. పేదలందరికీ ఇళ్ల పథకం లే ఔట్లలో ఇళ్ల నిర్మాణాలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల పనులను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ, డ్వారా పీడీలు వేణుగోపాల్, యుగంధర్ కుమార్, పంచాయితీ రాజ్ ఎస్ఇ బ్రహ్మయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, సిపిఒ శేషశ్రీ, డిఇఒ శైలజ పాల్గొన్నారు.

కొలుపుల సంఘటనే గొడవలకు కారణం : రూరల్ సిఐ

ప్రజాశక్తి - మాచర్ల



మీడియాతో మాట్లాడుతున్న రూరల్ సిఐ సమీముల్లా

వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామంలో టిడిపి వర్గానికి చెందినవారు కొలుపులు చేసుకుంటూ ఊరేగింపుగా వెళుతూ వైసిపికి చెందిన నాయకుడు ఇంటిముందు పసుపు చల్లడం వల్లే ఘర్షణ మొదలై గొడవకు దారితీసిందని రూరల్ సీఐ సమీముల్లా అన్నారు స్థానిక సిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో బుధవారం మాట్లాడుతూ సెన్సిటివ్ గ్రామాలలో ఏమాత్రం పొరపాటు జరిగిన ఘర్షణలకు కారణమవుతున్నాయని, అది నాయకులు దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు పోలీసులు ఎప్పుడూ పక్షపాత వైఖరి చూపిచరని మంగళవారం గొడవ జరగగానే సంఘటనా స్థలానికి చేరుకున్నామని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చామని ఇప్పటికీ పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. ఓ విలేఖరి టిడిపి వాళ్ళ ఇంటి పైకి మహిళలు దాడికి వెళ్లారు అంట కదా అని అడగ్గా ఆడవాళ్ళ మధ్య చిన్న చిన్న వివాదాలు నడుస్తున్నాయని అతిపెద్ద సమస్య కాదని ఘర్షణ పడిన వారంతా దగ్గర బంధువులని అందరి ఇళ్లు ఒకే చోట కావడంతో మహిళలు అటు ఇటు మాట్లాడుకోవడం జరుగుతుందన్నారు. పరిస్థితి శాంతియుతంగానే ఉందని తెలిపారు కొలుపుల సందర్భంగా టిడిపి వారు ఊరేగింపుగా వెళుతూ వైసిపి నాయకుడు ఇంటి ముందు పసుపు చల్లారని తిరిగి వస్తూ మళ్లీ చల్లారని ఆ సందర్భంగానే ఘర్షణ మొదలైందని తెలిపారు. ఇళ్లపై పడి లూటీ చేశారని తెలుగుదేశం వాళ్ళని దొరికిన వాళ్ళని దొరికినట్లు కొట్టారని జరుగుతున్న ప్రచారం అబద్ధం అన్నారు. ఎవరి ఇల్లు లూటీ కాలేదని ఇళ్లపై దాడులు జరగలేదని తెలిపారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని శాంతి భద్రతలను కాపాడేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సాగర్, ఎస్సై అనిల్ కుమార్ రెడ్డి, వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యంతోనే టిడిపి కార్యకర్తలపై దాడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జిజిహెచ్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న జీవీ

వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో జరిగిన ఘర్షణలో గాయపడిన టిడిపి కార్యకర్తలను పోలీసులు మంగళవారం రాత్రి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు బుధవారం ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మీడియాతో మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో వైసిపి అరాచకం రాజ్యమేలుతుందన్నారు. వైసిపి దాడిచేస్తున్నా పోలీసుల ప్రేక్షక పాత్ర వహించారని, పల్నాడు జిల్లా ఎస్పి వైసిపి నేతగా మారాడని అన్నారు. పల్నాడుజిల్లాలో శాంతి భద్రతలు క్షీణించా యన్నారు. గ్రామంలో దేవుళ్లకు పూజలు చేసుకునే స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందని, గ్రామంలో రెండు గంటల పాటు వైసిపి వాళ్లు మారణహోమం సష్టిస్తే పోలీసులు కనీసం స్పందించ లేదన్నారు. మాచర్ల ఎమ్మెల్యే సోదరుడు జన్మదిన వేడుకల్లో నిమ గ్నమైన పోలీసులు శాంతిభద్రతలను గాలికి వదిలివేశారన్నారు. నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కూడా చేయలేదని చివరి ప్రాణాలు పోతున్నా గుంటూరు వెళ్లిపోండని బయటకు నెట్టేశారని అన్నారు. టిడిపి నేతలు మద్దిరాల మ్యాని, చిట్టిబాబు ఆయన వెంట ఉన్నారు.

పేదల కోసం పని చేసిన హుస్సేన్



నివాళులర్పిస్తున్న పాశం రామారావు, జొన్నా శివశంకర్ తదితరులు

ప్రజాశక్తి-తాడేపల్లి : సామాన్య పేద కుటుంబంలో పుట్టి కడ వరకు పేదల కోసం పని చేసిన దర్శనపు హుస్సేన్ ధన్యజీవి అని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు నివాళు లర్పించారు. సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దర్శనపు హుస్సేన్ 14వ వర్ధంతి సభ బుధవారం ముగ్గురోడ్డులోని సిపిఎం కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు హుస్సేన్ అధికారుల వెంట పడి పని చేయించేవారని తెలిపారు. నేడు బిజెపి ప్రమాదం పెరిగిన నేపథ్యంలో హుస్సేన్ లాంటి నిబద్ధత, అకింతభావం గల కార్యకర్తలు లేకపోవడం సిపిఎంకు తీరిన లోటని అన్నారు. ఆయన స్ఫూర్తితో కార్యకర్తలు ప్రజలను సమీకరించి పని చేయాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ అనేక ఆటుపోట్లు, ఇబ్బందులు ఎదురైనా కడ వరకు మొక్కవోని దీక్షతో హుస్సేన్ ముందుకు సాగారని చెప్పారు. సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ముగ్గురోడ్డు ప్రాంతం ఒకప్పుడు దాడులు, దౌర్జన్యాలకు బాధిత పేటగా ఉండేదని చెప్పారు. సిపిఎం పేదలకు అండగా నిలబడి రౌడీయిజానికి, సంఘ విద్రోహ శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన సంగతిని గుర్తు చేశారు. ఈ విషయాన్ని నేటి యువతరం తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, వేముల దుర్గారావు, శాఖ కార్యదర్శి దర్శనపు విజయబాబు, నాగమల్లేశ్వరరావు, సోలా ముత్యాలరావు, వి.సామ్యేలు, సద్గుణరావు, లీలమ్మ, ఆనందరావు, గోపమ్మ, ఆర్.జడ్సన్, శ్రీనివాసరావు, దేవకుమార్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తి చేయండి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 106 నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ను అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గా మార్చాలని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి కోరారు. ప్రాజెక్టులను పూర్తి చేయడం వల్ల కోట్లాదిమందికి ఉపాధి అందించగల మన్నారు. రాష్ట్ర సంపద, ప్రజల ఆదాయాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గత 4 సంవత్సరాలుగా నీటిపారుదల ప్రాజెక్టులకోసం రాష్ట్ర బడ్జెట్లలో 44 వేల 500 కోట్లు కేటాయించి వ్యయం చేసింది మాత్రం కేవలం20 వేల 7 వందల 43 కోట్లు మాత్రమేనని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా ప్రాజెక్ట్ ల అంచనా వ్యయం 30 వేల కోట్లకు పెరిగిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేస్తే అంతకన్నా మించిన సంక్షేమ కార్యక్రమం మరొకటి ఉండదన్నారు. 10 లక్షల కోట్లు అప్పులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం 2.5 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు ఖాతాలో వేసిందని వాటిలో 20 శాతం నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసినా నేడు ఆంధ్రప్రదేశ్లో నిర్మాణంలో ఉన్న 106 నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసు కోవచ్చునని వివరించారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన నరసరావుపేట వాస్తవ్యురాలు సూరపురెడ్డి శ్రీనివాసరెడ్డి గారి కుమార్తెయును, కంజుల వెంకటేశ్వరరెడ్డి గారి భార్య శ్రీమతి సూరపురెడ్డి సువర్ణ గారి ద్వారా సమాచారము పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా-

యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని గుంటూరు వాస్తవ్యురాలు లింగిశెట్టి వెంకట స్వామి గారి భార్య నాగరాజేశ్వరి నా క్లయింట్ కు రు.1,25,00,000/- (అక్షరాల ఒక కోటి ఇరువది ఐదు లక్షల రూపాయల) కు విక్రయించి సదరు క్రయ ధనములో దఫాలవారీగా రు.80,00,000/-లు (అక్షరముల ఎనభై లక్షల రూపాయలు) అనగా తన యొక్క బ్యాంకు ఎకౌంటుకు మరియు తన యొక్క బాకీల నిమిత్తం కెనరా బ్యాంకు, ఎ.ఆర్.యం బ్రాంచి, విజయవాడ వారికి నా క్లయింటు ద్వారా చెల్లింపులు చేయించిన దరిమిల ది.6-3-2023 న నా క్లయింట్ పేరున విక్రయ ఎగ్రిమెంటును వ్రాయించి యిచ్చినారు. శేషించిన క్రయ ధనము రు.45,00,000/- (అక్షరముల నలభై ఐదు లక్షల రూపాయలు) కెనరా బ్యాంకు, ఎ.ఆర్.యం. బ్రాంచి, విజయవాడ వారికి తన యొక్క బాకీ చెల్లింపుల నిమిత్తము వన్ టైమ్ సెటిల్మెంట్ క్రింద ఉత్తర్వులు పొంది సదరు విషయములు తెలియపరిచిన తదుపరి నా క్లయింట్ ఆమె తరుపున సదరు బ్యాంకుకు రు.45,00,000/- (అక్షరముల నలభై ఐదు లక్షల రూపాయలు) కెనరా బ్యాంకు, ఎ.ఆర్.యం. బ్రాంచి, విజయవాడ వారికి చెల్లించి రిజిష్టరు చేయమని కోరిన యెడల రిజిష్టరు చేయగలనని షరుతులతో నా క్లయింట్కు ఎగ్రిమెంటు వ్రాయించి యిచ్చియున్నారని, సదరు ఆస్థిలో వున్న శుభం పెట్రోలియమ్స్ సాతులూరు (భారత్ పెట్రోలియమ్స్) అను పేరుతో వున్న పెట్రోల్ బంకును నా క్లయింట్ తండ్రి గారు సూరపురెడ్డి శ్రీనివాసరెడ్డి గారు బి.పి.సి.యల్. అధికారుల అనుమతితో వాటా దారునిగా వ్యాపారం చేయుచున్నారు. సదరు ఆస్థిని ఆమె నా క్లయింట్కు రిజిష్టరు చేయకుండా తన యొక్క కుమారుడు శ్రీనివాస్, కోడలు సుబ్బలక్ష్మి గార్లతో కుమ్మకై వేరే వారికి అన్యాక్రాంతములు చేయవలెనని తప్పుడు అగ్రిమెంటును దస్తావేజులను ఇతరుల పేరున సృష్టించి అన్యాక్రాంతము చేయవలెననే దురుద్దేశ్యముతో వున్నారని, ఆ విధముగా సృష్టించబడే దస్తావేజులు నా క్లయింట్ను కాని, ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని బైండ్ చేయజాలవని, లేని యెడల నా క్లయింటు కోర్టు ద్వారా సదరు వ్యక్తులపై మరియు పైన తెలిపిన వారిపై తగు చర్యలు తీసుకొని సదరు ఆస్థిపై తనకు గల హక్కులు పొందగలరని ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

షెడ్యూలు

పల్నాడు జిల్లా, నరసరావుపేట రి॥ డి॥, నరసరావుపేట సబ్ డిస్ట్రిక్ట్, సాతులూరు గ్రామ డి.నెం.519/ఎ1 నందు య.2-04 సెంట్లు, డి.నెం.520/సి-ఎ1 నందు య.1-37 సెంట్లును, డి.నెం.520/సి-ఎ3 లో య. 2-13 సెంట్లును వెరశి భూమి మీద ఏక ఖండముగా వున్న య.5-54 సెంట్లలో పడమర దరిన గల య. 0-98 సెంట్లు స్థలము అందలి భారత్ పెట్రోలియం కార్పోరేషన్ వారి పెట్రోలు బంకుకు హద్దులు:

తూర్పు: మాచే వదలబడిన దారి (అమ్మిన వారి)

దక్షిణం: నా తాలూకు ఆస్థి హద్దు(అమ్మిన వారి)

పడమర: ఇతరుల ఆస్థి హద్దు

ఉత్తరం: నరసరావుపేట-గుంటూరు వెళ్ళు రోడ్డు హద్దు

ఈ హద్దుల మధ్య య.0-98 సెంట్లు స్థలము అందలి భారత్ పెట్రోలియం కార్పోరేషన్ వారి పెట్రోలు బంకు.

తాళ్ళూరి మల్లిఖార్జునరావు,
అడ్వకేటు,
నరసరావుపేట.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S 472/2022 in IA 1719/2022
in
IA 1720/2022

Between

పోతంశెట్టి కోటేశ్వరమ్మ ...పిటీషనర్/వాది

మరియు

కొండెపాటి రమేష్ మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

టు,

ఇందలి 3వ రెస్పాండెంట్ మరియు 3వ ప్రతివాది అయిన బశల రామారావు S/o నరసయ్య R/o చంఘిస్కానపేట, H/o కొండవీడు, యడ్లపాడు మండలం.

పైన తెలిపిన దావాలో 3వ రెస్పాండెంట్ మరియు 3వ ప్రతివాది అయిన బశల రామారావు గారికి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ నోటీసులు ఉద్దేశ్యపూర్వకముగా తీసికొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టువారు మీ నోటీసు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీకోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినందున ఈ పత్రికా ప్రకటన ఇవ్వడమైనది. మీరు ది.22-09-2023వ తేదీన ఉ.10-30 ని॥లకు మీరు గాని లేదా మీ ప్లీడరు గారు గాని హాజరు కావలసియున్నది. లేని యెడల మీ పరోక్షమున శ్రీకోర్టు వారు తీర్మానము చేయునని తెలుపడమైనది.

వాయిదా తేది:22-09-2023

ఇట్లు
పాశం కోటి నాగయ్య
పిటీషనర్/వాది తరపు న్యాయవాది.

క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ఏర్పాటుకు పరిశీలన



ప్రజాశక్తి -తెనాలి

తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ను ఏర్పాటు చేసేందుకు నిపుణుల బృందం బుధవారం ఆసుపత్రిని పరిశీలించింది. ఎపిసాక్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేతత్వంలో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన వసతులను పరిశీలించారు. జిల్లాలోనే మొదటిసారిగా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా 30 సంవత్సరాలు దాటిన మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో వారిని తొలి దశలోనే పరీక్షించి తగిన తగిన చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుండి కాపాడ వచ్చన్న భావనతో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, షేర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారని ఇన్చార్జి మెడికల్ సూపరింటెండెంట్ మజిద బేగం తెలిపారు. పరిశీలనలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ తో పాటు, ఎపిసాక్స్ గైనకాలజీ అండ్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ భారతి, క్వాలిటీ కంట్రోలర్ ఇన్స్పెక్టర్ సిహెచ్ఎస్ నాయుడు, షేర్ ఇండియా బృందం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖ ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణ శివారు ప్రాంతం గుంటూరు రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద వాహనంపై వస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగి మెట్టెల వెంకటేశ్వర్లు ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు రెంటచింతల సబ్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్నాడు విధి నిర్వహణలో భాగంగా రెంట్ చింతల కలెక్షన్కు పోయి మాచర్ల వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది వెంకటేశ్వర్లు పట్టణంలోని ఎనిమిదో వార్డులో నివాసం ఉంటున్నాడు.

ప్రశ్నిస్తే నోటీసులా..?

ప్రజాశక్తి - తుళ్లూరు



పులి చిన్నా కు నోటీసు ఇస్తున్న పోలీసులు

ప్రశ్నించే వారిని పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని, పదేపదే నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధం చేస్తున్నారని అమరావతి దళిత, బహుజన జెఎసి నాయకులు పులి చిన్నా,చిలకా బసవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక అక్రమాలపై మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఇబ్రహీంపట్నం ఇసుక రేవు వద్ద చేపట్టే నిరసన కార్యక్రమంకు వెళ్ళడానికి వీలు లేదంటూ బుధవారం పోలీసులు నోటీసులు ఇచ్చారని వారు చెప్పారు. వైసిపి ఇసుక దోపిడీని ప్రశ్నించ కూడదా..అని నిలదీశారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ శివరామయ్య

ప్రజాశక్తి-తెనాలి: పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన బి.శివరామయ్య బుధ వారం ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. స్థానిక మార్కెట్ వంతెన నుంచి కొత్త వంతెన వరకూ ఆటోలు బారులు తీరిన వైనాన్ని గమనించిన ఆయన అక్కడ ఆటోలు నిలిపి ఉంచిన డ్రైవర్లతో మాట్లాడారు. ఆలపాడు, చుండూరు, మండూరు, పెదపూడి., అమృతలూరు, కూచిపూడి, చెరుకుపల్లి, కొల్లూరు, వేమూరు వైపు వెళుతున్న ఆటోలుగా తెలుసుకున్నారు. అయితే అన్నీ ఒకేసారి అక్కడ నిలిపి ఉంచరాదని, ట్రాఫిక్కు, ప్రయాణీకులకు అడ్డంకులు సృష్టించవద్దని వారిని హెచ్చరించారు. అలాగే నిబంధనలకు మించి ఆటోల్లో ప్రయాణీకులను ఎక్కించరాదని, మద్యం సేవించి ఆటోలు నడపరాదన్నారు. ఆటోలకు సంబంధించి అన్ని పత్రాలు దగ్గర ఉండాలన్నారు. నిబంధనలు పాటించనివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - గుంటూరు సిటీ



నిబంధనలకు విరుద్ధంగా నడిపే బార్లపై కఠిన చర్యలు తీసుకుంటానని, కొత్తపేట సిఐ షేక్ అన్వర్ బాషా బార్ల యజమానులను హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్ల యజమానులతో బుధవారం కొత్తపేట పోలీస్ స్టేషన్లో సమావేశం నిర్వహించరు. ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించాలని, బార్ చుట్టుప్రక్కల సిసి కెమెరాలు ఏర్పాటుచేసి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా బార్ యజమానులే బాధ్యత వహించాలన్నారు. 21 సంవత్సరాల లోపు వయసు ఉన్న వాళ్లకు మద్యం విక్రయించరాదని, ప్రభుత్వం నిర్దేశించిన సమయాలలోనే బార్లు నడపాలని వాటిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బిల్లు పెరుగుతుందేగాని తగ్గడం లేదు

సమరభేరిలో సిపిఎం నాయకుల ఎదుట మహిళల ఆవేదన



సిపిఎం నాయకులకు సమస్యలను చెబుతున్న మహిళలు

ప్రజాశక్తి - అమరావతి

విద్యుత్ బిల్లులు ప్రతినెలా పెరుగుతున్నాయేగాని తగ్గడం లేదని సిపిఎం నాయకుల ఎదుట ప్రజలు ఆవేదన వెలిబుచ్చారు. మండల కేంద్రమైన అమరావతిలోని జగ్జీవన్‌రామ్ కాలనీ, సుభాని కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను వివరించారు. గతంలో రూ.200 ఉండే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.500 వరకూ వస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాల కింద వస్తున్న డబ్బులకు బయట ధరల పెరుగుదల వల్ల అవుతున్న ఖర్చులకు పొంతనే లేదన్నారు. నివాస ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. అనంతరం సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ ప్రజల మీద భారాలు వేస్తున్న కేంద్రంలోని బిజెపి విధానాలను రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించడం లేదని, పైగా రాష్ట్ర ప్రభుత్వమూ భారాలు వేస్తోందని విమర్శించారు. సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంలో స్థానిక సంస్థలు విఫలమయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులను ఇవ్వకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం 4వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎస్.రాజకుమార్, ఎన్.వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

అధిక ధరలు, నిరుద్యోగం విద్యుత్ ఛార్జీలు, ప్రజలపై ప్రభుత్వాలు వేస్తున్న ఇతర భారాలకు నిరసనగా 4వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే సమరభేరిని జయప్రదం చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ మోడీ తాన అంటే జగన్మోహన్‌రెడ్డి తందానా అంటున్నారని, ప్రజలపై మోడీ మోపే భారాలను కనీసం ప్రశ్నించడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టే ఆందోళనల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.మహేష్, వెంకటరత్నం, రమణ, వై.సురేష్, రాజు, ఆదిత్య పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆదర్శనీయం లక్ష్మమ్మ జీవితం

వర్ధంతి సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

సరికొండ లక్ష్మమ్మ జీవితం ఆదర్శనీయమని రైతు సంఘం నాయకులు గద్దె చలమయ్య అన్నారు. స్థానిక రాజుల కాలినీలో సరికొండ లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన లక్ష్మమ్మ 8వ వర్ధంతి సభకు సిఐటియు జిల్లా నాయకులు గుంటూరు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ లక్ష్మమ్మ వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘాలలో చురుకైన పాత్రను పోషించారని, ఒకవైపు ఆర్థిక భారం వారిని కంగదీస్తున్నా లెక్క చేయక అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకొని ఇద్దరు కుమారులను ఉన్నతంగా తీర్చిదిద్దారని చెప్పారు. సామాజికంగా అభివృద్ధి చెందాలంటే ప్రతి కుటుంబంలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలన్నారు. అయితే నేడు విద్య పేదలకు అందని ద్రాక్షగా మారిన నేపథ్యంలో పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో చదువుకునే ఆసక్తి ఉన్నా కుటుంబం ఆర్థిక సమస్యల కారణంగా మధ్యలోనే



ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ సంపత్

ఆగిపోయే పరిస్థితి తలెత్తిందని చెప్పారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల ఎదుర్కొన్న లక్ష్మమ్మ.. విద్య కోసం పరితపించే పేద విద్యార్థులకు ఏదో ఒక విధంగా సహాయం చేయాలని తపన పడ్డారని గుర్తు చేశారు. ఆమే ఆలోచనలకు ఊపిరి పోస్తూ అమె వర్ధంతి రోజున ఐదుగురు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. లక్ష్మమ్మ ఆశయాలకు జీవం పోస్తున్న కుటుంబ సభ్యులను అభినందించారు. లక్ష్మమ్మ పెద్ద కుమారుడు లెనిన్‌బాబు మాట్లాడుతూ తన తల్లి తమకు ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు నేర్పించారని, అవే తమకు ఎనలేని సంపదని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్, అంగన్‌వాడి టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.మల్లీశ్వరి, ఎ.వీరబ్రహ్మం, ఎ.రామయ్య, ఆర్.పురుషోత్తం కుటుంబ సభ్యులు రాజు, చినబాబు, పద్మ, వెంకాయమ్మ, డాక్టర్ సంపత్ పాల్గొన్నారు. ముందుగా లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు ప్రజా సంఘాల నాయకుల ద్వారా ఆర్థిక ప్రోత్సాహకాలు అందించారు.

అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చొద్దు

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చే 41వ సిఆర్‌పిసి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ అంశంపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పండరిపురంలోని ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కెవిపిఎస్ మండల అధ్యక్షులు ఎస్.బాబు అధ్యక్షత వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల భూములను ధనికులు, భూస్వాములు ఆక్రమించుకుంటున్నారని, దాడులు, అత్యాచారాలూ పెరిగిన నేపథ్యంలో కేసుల సత్వర పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వివక్ష, ఇతర సమస్యలపై ఎస్సీ, ఎస్టీలు ఫిర్యాదులు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ పెట్టాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విల్సన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి రెండెకరాల సాగుభూమి, మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని, ప్రభుత్వమే ఇల్లు నిర్మించాలని లేదా ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. శ్మశానాల్లో పనిచేస్తున్న వారిని 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను ప్రారంభించి నిరుద్యోగులకు శిక్షణివ్వాలని కోరారు. విసికె పార్టీ నాయకులు వంజయ్య ముత్తయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ నూతన విద్యావిధానం దళితులను విద్యకు దూరం చేస్తుందని చెప్పారు. మూసేసిన పాఠశాలలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. అన్ని ఎస్సీ, ఎస్టీల కాలనీలకు శ్మశాన స్థలాలు కేటాయించాలని, ఆయా కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.మోహన్ మాట్లాడుతూ స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట క్రిస్టియన్ శ్మశానవాటికతోపాటు పట్టణంలోని చాలాచోట్ల శ్మశానాలు ఆక్రమణకు గురయ్యాయని, దీనిపై పోరాడాల్సి ఉందని చెప్పారు. దళితులపై దాడులకు పాల్పడ్డం ద్వారా వారిని వికలాంగులను చేసిన వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధితులకు నష్టపరిహారంగా ఇచ్చేలా చట్టం రూపొందించాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని స్థాయిల్లోనూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, పనిచేసే సంఘాలకు కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో దళితుల నుండి ప్రభుత్వం తీసుకున్న భూములను వెంటనే తిరిగివ్వాలని కోరారు. బిజెపి మతోన్మాద శక్తులు మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అన్ని అంశాలపై సాగే పోరాటాల్లో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. ఇదిలా ఉండగా వచ్చేనెలలో కెవిపిఎస్ నిర్వహించే దళిత, గిరిజన రక్షణ యాత్రకు అన్ని సంఘాల నాయకులూ మద్దతు తెలిపారు. సమావేశంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.లక్ష్మణ్, ఎఎన్‌పిఎస్ నాయకులు డి.రాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఐక్యతా అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

ఫారం-7 దరఖాస్తులపై కలెక్టర్ విచారణ

ప్రజాశక్తి-ఈపూరు

ప్రత్యేక సారాంశ సవరణ-2024లో భాగంగా మండలంలోని ఎ.ముప్పాళ్లను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముప్పాళ్ల-1 సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎలక్టోరల్ రోల్స్ పరిశీలనా, మార్పులు, చేర్పులు పునరావృతమైన ఓట్ల తొలగింపు వంటివి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు. గ్రామంలోని బీసీ కాలనీలో ఓటర్లకు సంబంధించిన ఫారం-6, ఫారం-7 దరఖాస్తుల ఇళ్లకు వెళ్లి విచారించారు. గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడి ప్రత్యేక సారాంశం సవరణ-2024 పై వివరాలు సేకరించారు. బూత్ లెవెల్ అధికారులు, ఎఇఆర్‌ఒలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి, తహశీల్దార్ సుధాకర్, ఎంపిడిఒ ఎవి రంగనాయకులు పాల్గొన్నారు.



చీమలమర్రిలో విచారణ చేస్తున్న తహశీల్దార్ నగేష్

నిబంధనల ప్రకారమే ఓట్ల తొలగింపు

ప్రజాశక్తి - నకరికల్లు

ఎన్నికల నిబంధనల మేరకు మండలంలో 2553 ఓట్లను తొలగించినట్లు తహశీల్దార్ నగేష్ తెలిపారు. వాటిపై ప్రతిపోలింగ్ బూత్‌లోనూ విచారణ చేస్తున్నామన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన చీమలమర్రిలో 197 పోలింగ్ బూత్ పరిధిలో 75 ఓట్లు, 198 పరిధిలో 49 ఓట్లు, 199 బూత్ పరిధిలో 83 ఓట్లు తొలగించినట్లు వివరించారు. ఇవన్నీ నిబంధనల ప్రకారమే జరిగాయన్నారు.

జగన్‌కు ఇంకో ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తాడు : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



బ్రిటీష్ పాలనకంటే దారుణంగా జగన్ పాలన ఉందని, రాష్ట్రంలోపోలీస్, అరెస్టుల రాజ్యం నడుస్తోందని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్‌కు రాజ్యాంగం అంటే గౌరవం లేదని, పౌరహక్కులను కాలరాస్తున్నారని, ఇలాంటి వారికి ప్రజాస్వామ్యంలో చోటు లేదని అన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే పాపమన్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారని, నిరసనలకు పిలుపునిస్తే నాయకులను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా ఇసుక మాఫియా చెలరేగిపోతోందని, జేపీ సంస్థ ముసుగులో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తున్నారని ఆరోపించారు. జగన్‌కు ఇంకో ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్నే అమ్మేస్తాడని ఎద్దేవ చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం సమరభేరీ

ప్రజాశక్తి-తాడేపల్లి

పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ప్రచారభేరి కార్యక్రమం బుధవారం ముగ్గురోడ్డులో ప్రారంభమైంది. ముగ్గురోడ్డు, రన్నింగ్ రూమ్ సెంటర్, పోతురాజుస్వామి గుడి, మున్సిపల్ ఆఫీసు ఏరియా, కెఎల్ రావు కాలనీ, పుష్కర కాలనీ, బోటుయార్డు తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ సిపిఎం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఆరేళ్లలో రూ.400 ఉన్న గ్యాస్ ధర రూ.1200 చేశారని, ప్రస్తుతం ఎన్నికలు ముందుకొచ్చిన నేపథ్యంలో రూ.200 తగ్గించడం పచ్చి మోసమని విమర్శించారు. పెరిగిన అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలతో సగటు జీవి జీవించడం దుర్భరంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు జొన్నా శివశంకరరావు, నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, డి.వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, డి.విజయబాబు, కె.బాబూరావు, కె.మేరి, వి.సామ్యేలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఉండవల్లిలో సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రచారభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈమని రామారావు , రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, యు.పార్ధ సారధి, కె.రామకృష్ణ, కొలకలూరి గాంధీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిపిఎం సమరభేరీ జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఎం టి ఎం సీ పరిధిలోని కుంచనపల్లి లో ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సిపిఎం శ్రేణులు కరపత్రాలను పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి , సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు, పట్టణ నాయకులు వేముల దుర్గారావు, సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, మండల నాయకులు పల్లె కృష్ణ, బత్తుల సంసోను, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి:మంగళగిరిలో కొత్తపేటలోని సిపిఎం కార్యాలయం వద్ద నుండి సమరభేరి ప్రచార కార్యక్రమాన్ని రాఘవులు ప్రారంభించి మాట్లాడారు. పలు వార్డుల్లోను, సెంటర్లోనూ ప్రచారం నిర్వహించి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ ఎస్ చేంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వివి జవహర్లాల్, ఎం బాలాజీ, పట్టణ నాయకులు తన్నీరు శ్రీరాములు, కే నాగేశ్వరరావు, ఎం రాంబాబు, కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సచివాలయాల వద్ద జరిగే నిరసన, మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నా లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఆత్మకూరు గ్రామంలోని సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని కోరుతూ సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో శాఖా కార్యదర్శి వుద్దంటి దుర్గారావు సభ్యులు సిహెచ్ సీతారామాంజనేయులు, గడ్డం అజయ్ కుమార్, వెంగళ రామారావు, డి.శర్మ బిట్రా రాంబాబు, సిహెచ్.గిరిధరరావు, ఆనందం బాబ్జి,వి.సుబ్రహ్మణ్యం, గౌరబత్తుల లక్ష్మి పాల్గొన్నారు.

నీరుకొండ, కురగల్లు గ్రామాలలో సమరభేరి కరపత్రాల పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, నాయకులు ఎం భాగ్యరాజు మాట్లాడుతూ బిజెపి విధానాలను ప్రజలు ఎండగట్టాలని అన్నారు. సమస్యలు పరిష్కారం కోసం సెప్టెంబర్ 4 తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమంలో కె నానయ్య కే వీరయ్య కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని : నంబూరు గ్రామ పరిధిలోని అలీ రఫత్ నగర్ లో సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత తొమ్మిదిన్నర ఏళ్లలో తాను ఇచ్చిన వాగ్దానానికి భిన్నంగా ధరలు విపరీతంగా పెంచిందని, పజలపై జిఎస్టి తదితర పన్నుల భారం మోపిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతిఘటించాల్సింది పోయి కేంద్రానికి వత్తాసు పలుకుతున్నదన్నారు. దానిలో భాగంగా విద్యుత్తు ప్రైవేటీకరణ, తదితర మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్రంగా విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పెదకాకాని మండల కార్యదర్శి ఎన్ శివాజీ , మేడిద రాంబాబు, సాంబయ్య, కే సుబ్బారావు, ఎం అంకమ్మరావు, కే శ్రీను, టీ చెల్లయ్య, వెలుగు బ్రహ్మయ్య పాల్గొన్నారు

ప్రజాశక్తి -తెనాలి :ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరిలో భాగంగా పట్టణ పరిధిలోని చంద్రబాబునాయుడు కాలనీలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయాణ, పట్టణ కార్యదర్శి కె బాబు ప్రసాద్, నాయకులు షేక్ హుస్సేన్ వలి, ఎన్ రాజ్యలక్ష్మి, ఎస్.కె ఆషాబి, పి. చంద్రకళ ప్రచారం నిర్వహించారు. తెనాలి రూరల్ గ్రామాలు కొలకలూరు, గుడివాడలో సిపిఎం బృందం పర్యటించింది. ఆ పార్టీ సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి నేతృత్వంలో జరిగిన పర్యటనలో ఎస్సీ, ఎస్టీకి 200 యూనిట్ల వరకూ సబ్సిడీ ఉన్నా రూ.1200 విధ్యుత్ బిల్లు వచ్చిందంటూ గుడివాడ గ్రామస్తులు బృందం దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ముద్దన సాంబశివరావు, జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల: నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి మోడీ వాగ్దానాలు ఆటకెక్కాయి అని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈ మని అప్పారావు విమర్శించారు. సమరభేరి ప్రచార కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాలలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నాయకులు జెట్టి బాలరాజు ఎం నాగమల్లేశ్వరరావు ఎన్ యోగేశ్వ రరావు బి అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ఫిరంగిపురం మ ండలం గుండాలపాడు, మునగపాడు, బేతపూడి, ఎర్రగుంట్లపాడు తదితర గ్రామాల్లో సిపిఎం ఫిరంగిపురం మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ వెంకటేశ్వర్లు నాగమల్లేశ్వరరావు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు :కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మేడికొండూరులో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బైరగాని శీనివాసరావు, నాయకులు బొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు : కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపియం నాయకుల స్థానిక స్వర్ణభారతి నగర్, కొత్త రోడ్డు, పాత రోడ్డు, మిషన్ ఫారం, ఇద్యా నగర్ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆది నికల్సన్, షేక్.ఖాసిం షహీద్, జి.లూదర్‌పాల్, ఎస్.పద్మనాయుడు, అచ్యుత్ కుమారి, దొడ్డ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్ :కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సమరభేరీ ప్రచార కార్యక్రమాన్ని దశలవారీ ఆందోళనను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. బుధవారం సాయంత్రం పెదనందిపాడు. తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం సీనియర్ నాయకులు జంపని రామారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సిపిఎం విస్తృత సమావేశంలో రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దోప్పలపూడి రమేష్ బాబు , సిపిఎం నాయకులు చుక్క యానాదులు దేవరకొండ శీను ముద్ద న వెంకటేశ్వర్లు మద్దూరి రమణ సలీం శివ నాగేశ్వరరావు షమ్మీ జ్యోతి కుమారి యశ్వంత్ లక్ష్మి పాల్గొన్నారు.


నంబూరులో మాట్లాడుతున్న వై నేతాజీ


దుగ్గిరాల ప్రచారంలో ఈమని అప్పారావు


గుంటూరు స్వర్ణభారతి నగర్‌లో


మంగళగిరిలో ప్రచారంలో జెవి రాఘవులు


ఉండవల్లిలో


కురగల్లులో


ఆత్మకూరులో


ఫిరంగిపురంలో


మేడికొండూరులో


పెదనందిపాడులో మాట్లాడుతున్న పాశం రామారావు


తెనాలిలో మాట్లాడుతున్న భావన్నారాయణ

రెండు గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవులకు ఎన్నిక

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాల, మోరంపూడి గ్రామాల ఉపసర్పంచ్ పదవులకు సోమవారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈవో పీఆర్డి శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీ ఎన్నికల సమయంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ రెండు పంచాయతీల ఉపసర్పంచ్‌ల రెండున్నర సంవత్సరాల పదవి కాలం అనంతరం రాజీనామాలు చేసి క్రొత్త వారిని ఎన్నుకోవాల్సి ఉన్నది. ఇంతవరకు దుగ్గిరాల ఉపసర్పంచిగా పనిచేసిన గాలం ఫణీంద్ర, మోరంపూడి ఉపసర్పంచ్ ఏలూరు మల్లేశ్వరి రాజీనామా చేశారు. ఈ రెండు పంచాయతీలకు కూడా వైఎస్ఆర్ పార్టీ అభ్యర్థులు సర్పంచులుగా ఉన్నారు.



చేబ్రోలులో

యానిమేటర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - చేబ్రోలు, వట్టిచెరుకూరు


వట్టిచెరుకూరులో వినతి

యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో 23వ తేదీ ప్రారంభమైన ప్రచార యాత్ర బుధవారం చేబ్రోలు, వట్టి చెరుకూరు మండలాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా జరిగిన యానిమేటర్స్ మండల విస్తృత సమావేశం నిర్వహించారు. చేబ్రోలులో మేరీ రాఘవ అధ్యక్షతన సభలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా యానిమేటర్లతో బలవంతంగా గేదెలను కొనుగోలు చేసే విధానాలు మానుకోవాలని అధికారులను కోరారు. ఫామింగ్, నాన్ ఫామింగ్ పేరుతో టార్గెట్స్ పెట్టీ వేధింపులకు గురి చేయటం సరికాదని అన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వకుండా అదనపు ధరలకు గేదెలను, కోళ్లను, గొర్రెలను కొనుగోలు చేసి పశు పోషణ చేయాలని చెప్పడం ఎంతవరకు సరైనది అని అన్నారు. నేడు మారుతున్న పరిస్థితుల్లో కోళ్ల పెంపకం కష్టంగా ఉంటే అధికారులు ఏ విధంగా టార్గెట్స్ పెడతారని ప్రశ్నించారు. యానిమేటర్లకు మూడు సంవత్సరాల కాలపరిమితి, 45 సంవత్సరాల వయోపరిమితి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న దరలకు అనుగుణంగా రూ. 26వేలు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా మేరీ రాఘవ, నగమల్లేశ్వరి, కోశాధికారిగా శిరీష, ఉపాధ్యక్షులుగా ఝాన్సీ, సహాయ కార్యదర్శిగా వెంకటరమణ లను, కమిటీ సభ్యులుగా పావని ,దివ్య, శ్రీదేవి, త్రివేణి, యూనియన్ గౌరవ అధ్యక్షులుగా సిహెచ్.హనుమంతురావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వట్టిచెరుకూరులో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా శోభారాణి, ధనలక్ష్మి, కోశాధికారిగా శివకుమారి, ఉపాధ్యక్షులుగా చంద్రావతి, గౌరవాధ్యక్షులుగా నాగరాజును ఎన్నుకున్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాఖీ పండుగ

ప్రజాశక్తి-గుంటూరు

రాఖీ పండుగను పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ విద్యార్థినుల విభాగం ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేద్దాం-ఆడపిల్లలను కాపాడుకుందాం అనే నినాదాలతో ఉన్న రాఖీలను పెద్ద ఎద్దున కట్టారు. అనేక కాలేజిలు, పోలీసు స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థినులు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గరల్స్ కో కన్వీనర్ బి.సుచరిత మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలకు మద్యం, మత్తు పదార్థాలు కారణం అవుతున్నాయన్నారు. ఈ రాకీ పండుగ సందర్భంగా మద్యం, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.కె.సమీర్, నాయకులు నరసింహ, అమృత, షకీలా తదితరులు పాల్గొన్నారు.

ఒక్క దస్తావేజూ రిజిస్టర్ కాలేదు

లేఖర్ల పెన్‌డౌన్‌తో కార్యాలయాలు వెలవెల



ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు బుధవారం చేపట్టిన పెన్‌డౌన్ జయప్రదమైంది. ప్రతిరోజూ 20-30 దస్తావేజులు రిజిస్టర్ అయ్యేవి. అయితే పెన్‌డౌన్ నేపథ్యంలో బుధవారం ఒక్క దస్తావేజూ రిజిస్టర్ కాలేదు. కక్షిదార్లు లేక కార్యాలయం వెలవెలబోయింది. ఈ సందర్భంగా నాయకులు ఎస్.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కార్డ్‌ప్రైమ్ 2.0 వల్ల దస్తావేజు లేఖర్లు రోడ్డునపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వంపై ఆధారపడకుండా ప్రజలకు సహాయ పడుతూ ఉపాధి పొందతున్న తమపై ఈ చర్యలు సరికావని అన్నారు. క్రోసూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సుమారు 50 మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని, ప్రభుత్వ చర్యతో వీరంతా రోడ్డున పడతారని ఆందోళన వెలిబుచ్చారు.



ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0 విధానంతో కక్షిదారులకు సమస్యలు వస్తాయన్నారు. డాక్యుమెంట్లు తమ అవసరాలకు అనుగుణంగా రాయిచుకునే అవకాశం ఉండదన్నారు. ఒరిజినల్ దస్తావేజులు ఉండక పోవటంతో కక్షిదారుల్లో గందరగోళ నెలకొంటుందని, డిజిటల్ సంతకాలు ఫోర్జరీకి గురయ్యే అవకాశం ఉందని అన్నారు.

ఇదిలా ఉండగా స్థానిక కార్యాలయంలో ప్రతిరోజూ 40 నుండి 70 వరకు రిజిస్ట్రేషన్ అవుతుంటాయి. పెన్‌డౌన్ నేపథ్యంలో ఒక్కటీ కాలేదు. ఒక్కో దస్తావేజుకు కనీసం రూ.20 లక్షల ఆస్తి రిజిస్ట్రేషన్ చేస్తే ప్రభుత్వానికి రూ.1.50 ఆదాయం వస్తుంది. ఈ లెక్కన స్థానిక కార్యాలయం ద్వారా రోజుకు రూ.15-20 లక్షల వరకు ఆదాయం ఉంటుంది.



ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల దీక్ష శిబిరాన్ని జై భీం భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జె. విజయ్‌కుమార్ సందర్శించి మద్దతు తెలిపారు. బి.మల్లేశ్వరరావు, సిహెచ్.కోటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.సుధాకర్‌రావు, జె.కమల కుమార్, ఎం.పద్మారావు, ఎం.దేవరాజ్ పాల్గొన్నారు.

కౌల్దార్లకు పంట రుణాలిప్పించండి : కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



పురోగతి లేని జగనన్న కాలనీ లే అవుట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లబ్ధిదార్లు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని మండల ప్రత్యేకాధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ మేరకు వారితో బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలులో సమీక్షించారు. లే-అవుట్‌ల వద్ద ఆర్చ్‌ల నిర్మాణాకి అంచనాలు పూర్తి చేసి సుందరంగా నిర్మించాలని చెప్పారు. అవసరమైన చోట నీటి ట్యాంక్‌ల ద్వారా నీరందించి పనులు పూర్తి చేయాలన్నారు. కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డుల విషయంలో జిల్లా ముందంజలో ఉందని, అదేవిధంగా రుణాల మంజూరులోనూ ముందు వరసలో నిలపాలని సూచించారు. అవసరమైతే మండల స్థాయిలో బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మరణించిన, అడ్రస్‌లు తెలియని వారి విషయములో సమగ్ర ఓటరు సర్వే చేయించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రూ.10 వేల విలువ చేసే ప్రీ - మాన్సూన్ డ్రై కిట్ లను ఎస్సీలకు ఎంతమందికి ఇచ్చారని వివరాలు అడిగారు. జగనన్న పాల వెల్లువ అంశంలో వాలంటీర్లు క్షేత్ర స్థాయిలో 20 మండలాల్లో సమగ్ర సర్వే నిర్వహించి 100 శాతం జీవాల వివరాలు ఆదివారం నాటికి పూర్తి చేయాలన్నారు. స్వామిత్వ కార్యక్ర్యములో 20 పనులుకు గాను 13 పనులు పూర్తయ్యాయని, మరో 7 పురోగతిలో ఉన్నాయని చెప్పారు. పూర్తి చేసిన వై.యస్.ఆర్ హెల్త్ క్లీనిక్ లు మరియు మౌలిక వసతులు కల్పించిన గ్రామ సచివాలయలను త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. పూర్తయిన రైతు బరోసా కేంద్రాలను ప్రారంభించాలన్నారు. సమీక్షలో జెసి ఎ.శ్యాం ప్రసాద్, డిఆర్ఒ వినాయకం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

మంత్రి రాంబాబు వద్దకు శుక్రవారం సామూహిక రాయబారం - మద్దతు కోసం సిపిఎం నాయకులను కలిసిన భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి:
భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్లో ఉన్న క్లెయిములను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎ.ప్రసాదరావు డిమాండ్ చేశారు. తమ సమస్యలపై మంత్రి అంబటి రాంబాబుకు శుక్రవారం సామూహిక రాయబారం ఉంటుందని, తమ పోరాటానికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఈ మేరకు బుధవారం సిపిఎం నాయకులను ఆ పార్టీ కార్యాలయం కలిశారు. వినతిపత్రాన్ని ఇచ్చి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వివరించారు. సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, పట్టణ కార్యదర్శి డి.విమల మాట్లాడుతూ భావన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును విధులను వైయస్ జగన్ మోహన్‌రెడ్డి దారి మళ్లించడం సరికాదన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల పోరాటాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.వీరబ్రహ్మాం, పి.మహేష్, పి.సూర్య ప్రకాశరావు, సాల్మన్‌రాజు, సైదులు, కొండలు పాల్గొన్నారు.



చలమయ్య, విమలకు వినతిపత్రాలు ఇస్తున్న కార్మికులు



తహశీల్దార్ నగేష్‌కు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

అక్రమ మైనింగ్‌పై చర్యల కోసం టిడిపి వినతి

ప్రజాశక్తి - నకరికల్లు

త్రిపురాపురం, నకరికల్లు గ్రామాల్లో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దార్ నగేష్, ఎస్ఐ బాలకృష్ణకు టిడిపి నాయకులు బుధవారం వినతిపత్రాలిచ్చారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నకరికల్లు, త్రిపురాపురంలో కొండలను ఇష్టారాజ్యంగా తవ్వి మట్టిని తరలిస్తున్నారని, ప్రభుత్వానికి రాయల్టీ కూడా చెల్లించకుండా జేబులు నింపేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం ద్వారా మైనింగ్ అనుమతులు పొందిన వారి వివరాలు, ఎంత విస్తీర్ణంలో తవ్వుతున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అలీబాష, ఇ.శ్రీహరి, డాక్టర్ అహ్మద్ బుడే, ఆర్.గోపికృష్ణ, ఎస్.అప్పారావు, డి.రాందాస్, చిన్న రంగయ్య, హుస్సేన్‌బి, పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కమ్యూనిటీ హాలు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిధిలోని లేమల్లెలో డిఎంఎఫ్ నిధులతో నిర్మిస్తున్న ముస్లిముల కమ్యూనిటీ హాల్ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం పరిశీలించారు. ముస్లిముల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ యు.పున్నమ్మ, ఎలమందయ్య, ఎంపిపి బి.మీరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గీతాంజలి స్కూల్లో ఘనంగా రక్షా బంధన్

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని గీతాంజలి స్కూల్స్‌లో రక్షా బంధన్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బాలురకు బాలికలు రాఖీలు కట్టి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ప్రిన్సిపాల్ తేళ్ళ కృష్ణవేణి మాట్లాడుతూ తల్లిదండ్రులు తర్వాత సోదరుడు తన చెల్లి లేదా అక్కకు కొండంత ధైర్యాన్ని ఇస్తూ అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటాడని చెప్పారు. సోదరుడు లేని బాలికలు అందర్నీ సోదరులుగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండంట్ వైఎల్ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





రాధా డిగ్రీ కళాశాల విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - వినుకొండ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్నాతకోత్సవంలో స్థానిక రాధా డిగ్రీ కళాశాల విద్యార్థి సయ్యద్ ఆశిష్ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా కాలేజీలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో కరస్పాండెంట్ కె.వి రాధాకష్ణమూర్తి మాట్లాడారు. సయ్యద్ ఆశిష్ బీకాం జనరల్ కోర్స్ చదివి గోల్డ్ మెడల్ సాధించడం వినుకొండకు, కాలేజీకి గర్వకారణమని అన్నారు. 20 ఏళు ్లగా డిగ్రీ విద్యలో ఎంతోమంది విద్యార్థులను యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకర్లుగా తీర్చిదిద్దడంలో రాధా డిగ్రీ కళాశాల ముందంజలో ఉందన్నారు. కాలేజీ అధ్యాపకులు టి.బి.యస్.యల్.ప్రసన్న కూడా గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని అన్నారు.

ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థినులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-ఈపూరు



గల్లా అపర్ణ, మిరియాల నవ్య

వర్సిటీ స్నాతకోత్సవంలో ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థినులు గల్లా అపర్ణ (బిపిఇడి), మిరియాల నవ్య (ఎంపిఇడి) గోల్డ్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ చుండు వెంకట్రావు తెలిపారు. పతకాలు సాధించిన వారిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు బలరాం నాయక్, ఎం.సురేష్, వై.సురేష్, ఎం.దాసు అభినందించారు.

చంద్రబాబుకు రాఖీ కట్టిన ముంతాజ్

ప్రజాశక్తి - పెదకూరపాడు : రాఖీ పౌర్ణమి సందర్భంగా బుధవారం టిడిపి ఆధ్వర్యంలో మహిళలకు మహాశక్తి రక్షాబంధన కార్యక్రమాన్ని టిడిపి జాతీయ కార్యాలయంలో నిర్వహించగా చంద్రబాబుకు పెదకూరపాడుకు చెందిన టిడిపి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ ముంతాజ్ రాఖీ కట్టారు.

భూ రికార్డుల స్వచ్ఛీకరణ సక్రమంగా చేపట్టాలి



ప్రజాశక్తి-గుంటూరు

గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం ద్వారా జరుగుతున్న భూముల రీసర్వేను నాణ్యతతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేయటానికి క్షేత్ర స్థాయి భూరికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు ఆర్‌డిఓ పరిధిలో భూముల రీసర్వే, రెవెన్యూ అంశాలు, సిసిఆర్‌సి కార్డుల మంజూరుపై తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియ నిర్దేశిత సమయంలో పూర్తి చేయటానికి ముందస్తు చర్యల్లో భాగంగా క్షేత్రస్థాయిలో భూ రికార్డుల స్వచ్ఛీకరణ (ఎఫ్.పీ.ఓ.ఎల్.ఆర్) కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. మూడో విడతలో రీసర్వే జరగనున్న గ్రామాల్లో ఎఫ్.పీ.ఓ.ఎల్.ఆర్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం భూ రికార్డుల స్వచ్ఛీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్.పీ.ఓ.ఎల్.ఆర్‌లో గుర్తించిన మ్యూటేషన్లను పదిహేను రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో భూముల రీసర్వే రెండో విడతలో జరుగతున్న 33 గ్రామాల్లో సెప్టెంబరు 5 నాటికి ఖచ్చితంగా ఫైనల్ ఆర్‌ఓఆర్ జారీ చేయాలన్నారు. ప్రస్తుతం భూముల రీసర్వేకు సంబంధించిన చాలా ప్రక్రియలు సరళీకతం చేసినందున ఓఆర్‌ఐ మ్యాపులు వచ్చే నాటికి గ్రామ హద్దులు, ప్రభుత్వ భూముల హద్దులను మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. గ్రౌండింగ్ ట్రూథింగ్ పూర్తి అయినప్పటి నుంచే భూహక్కు పత్రాలకు సంబంధించి భూయజమానుల వివరాలను పర్సనల్ లేయర్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో అసైన్డ్, ఇనామ్ భూములకు సంబంధించిన వివరాలను నిర్దేశిత ఫార్మేట్‌లో వెంటనే అందించాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరుకు వ్యవసాయ సహయకులను సమన్వం చేసుకొని రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే శాఖ ఏడీ నాగ శేషు, రెవెన్యూ డివిజన్ అధికారి ఎం ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నేతాజీ తదితరులు

సాంబశివరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి -పెదకాకాని

పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామపంచాయతీలో పనిచేస్తున్న జి సాంబశివ రావు(60) మంగళవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. బుధవారం ఆయన భౌతికకాయానికి స్వగ్రామం వెనిగండ్లలో అంత్యక్రియలు నిర్వహించారు. ముందగా సాంబశివరావు భౌతికకాయానికి సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి వై నేతాజీ, మండల గౌరవాధ్యక్షులు నన్నపనేని శివాజీ, సిఐటియు నగర కార్యదర్శి కె శ్రీనివాస్, ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు కె సుబ్బారావు, సాంబయ్య, అమృతరావ్, జిల్లా నాయకులు దివి నరసింహారావు, యుటిఎఫ్ నాయలకులు రంగారావు తదితరులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు సాంబశివరావుకు భార్య ముగ్గురు పిల్లలున్నారు.



మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

వైసిపి కన్వీనర్లతో సురేష్‌కుమార్ సమీక్ష

ప్రజాశక్తి - తుళ్లూరు :వైసిపి మండల కన్వీనర్లు, జెసిఎస్, బి.ఎల్.ఎ లతో ఆపార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంటూరు లోని వైసిపి కార్యాల యంలో జరిగిన సమావేశంలో సురేష్ కుమార్ మాట్లాడుతూ ఓట్ల నమోదు ప్రక్రియలో ఏమైనా పొరపాట్లు జరిగితే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు.

ఘనంగా రాఖీ పండుగ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు ప్రజలు జరుపుకున్నారు. చెల్లెలు అన్నయ్యలకు రాఖీలు కట్టి ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె హేమమాలిని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి రాఖీ కట్టారు.

'సఖి' ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించాలి



ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-గుంటూరు: 'సఖి' కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఏడాది వేతన బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు.సఖి పథకం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా సమావేశం ఏ.రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా సంక్షేమ శాఖకు అనుసంధానంగా సఖీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీనిలో అత్యున్నత విద్యావంతులైన ఉద్యోగులతోపాటు, నాలుగో తరగతి ఉద్యోగులు కూడా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారని చెప్పారు. వీరికిచ్చే జీత భత్యాలు రాష్ట్రప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇస్తున్న వాటిలో సగం కూడా లేవన్నారు. ఇది ఉద్యోగుల శ్రమను పూర్తిగా దోపిడీ చేయటమేనని అన్నారు. ఈ జీతాలు కూడా గత ఏడాది కాలంగా చెల్లించకపోవటంతో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందికి గురవుతున్నారన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సఖీ పథకం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దీపి.మనోజ మాట్లాడుతూ సఖి ఉద్యోగుల డిమాండ్లు అత్యంత న్యాయమైనవని, వారికి తమ యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సఖి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి, అధ్యక్షులుగా ఎ.రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎన్.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కె.ఝాన్సీ, కోశాధికారిగా జి.స్వర్ణలత ఎన్నికయ్యారు.



హకీంజానిని సత్కరిస్తున్న సీతారామయ్య హైస్కూల్ బృందం

హకీం జానికి తెలుగుభాషా దినోత్సవ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ బాలసాహితీ వేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని తెలుగుభాషా దినోత్సవ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి గుంటూరు పాటిబండ్ల సీతారామయ్య సిబిఎస్ఈ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు భాషా పురస్కారాన్ని అందించి, సత్కరించినట్లు బుధవారం హకీంజాని తెలిపారు. రాజ్యాసభ మాజీ సభ్యులు యలమంచిలి శివాజీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షులు సూర్యదేవర హనుమంతరావు, సెక్రటరీ కరస్పాండెంట్ విష్ణువర్ధన్, డైరెక్టర్ ఎల్ కృష్ణవేణి, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆళ్ళ నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎం.రవికాంత్ తదితరులు

గిడుగు జయంతి వేడుకల్లో కవి ఆళ్లకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నిర్వహించే తెలుగు భాషా దినోత్సవంలో గుంటూరు-2డిపో కండక్టర్, పట్టణానికి చెందిన కవి ఆళ్ళ నాగేశ్వరరావును సత్కరించారు. గుంటూరు ఆర్టీసీ ప్రాంగణం తిక్కన సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కండక్టర్‌గా పనిచేస్తూ, మరోవైపు సాహితీ రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆళ్ళ నాగేశ్వరరావును ప్రజారవాణా అధికారి కె.రవికాంత్ చేతల మీదుగా సత్కరించినట్లు బుధవారం ఆయన తెలిపారు. తెలుగు భాషకు వన్నెతెచ్చేలా ఆళ్ళ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో డిప్యూటి సిటిఎం ఎన్.శ్రీనివాసరావు, పివో మాలతి, ఏవో పవన్, గుంటూరు 1,2డిపో మేనేజర్లు ఎ.శివరామకృష్ణ, షేక్ అబ్దుల్ సలాం, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీరామ మున్సిపల్ హైస్కూల్‌లో మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం లోని శ్రీ రామ మునిసిపల్ హై స్కూలులో మాతబాష దినోత్సవం జాతీయ క్రీడా దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముందుగా శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులు మరియు, హాకీ మాంత్రికుడు కెప్టెన్ ధ్యాన్ చంద్ గారి చిత్ర పటాలకు పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను లాజర్ బాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంశాపత్రాలు అందించారు. తెలుగు టీచర్ షేక్ మౌలాలి ను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిహెచ్ నాగ శ్రీనివాసరావు, ఎం వి గౌతమ్, వి మురళీకృష్ణ చాంద్ బాషా ఎన్ సంధ్యారాణి విద్యార్థులు పాల్గొన్నారు.





హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న శాసనసభ్యులు శివకుమార్

ప్రజలకు ఆరోగ్య భరోసా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొల్లిపర

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ల ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుందని తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ అన్నారు . బుధవారం మండలంలోని దంతులూరు గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్లినిక్ల ద్వారా 12 రకాల జబ్బులకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే కాక 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2300 జనాభా గల ప్రతి గ్రామంలో ఈ క్లినిక్‌ను ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. కార్యక్రమంలో తెనాలి మార్కెట్ యార్డ్ చైర్మన్ అవుతూ సీతా నగేష్ రెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, తాసిల్దార్ నాంచారయ్య, గ్రామ సర్పంచ్ జ్యోతుల భాగ్యమ్మ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ముగ్గురికి ఆలపాటి పెళ్లి కానుక

ప్రజాశక్తి-తెనాలి: పట్టణంలో మూడు వార్డుల్లో లబ్దిదారులకు ఆలపాటి పెళ్ళి కానుక బుధవారం ఆ వార్డు నాయకులు అందించారు. నియోజకవర్గంలో పేద కుటుంబాల్లో జరిగే వివాహాలకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పెళ్ళికానుకగా ఉంగరం కాని, తాళిబొట్టు కాని అందిస్థానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో పట్టణంలోని 29, 32, 33 వార్డుల్లో బుధవారం మూడు కుటుంబాలకు చెందిన పెళ్ళికుమార్తెలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఆలపాటి పెళ్ళికానుకగా తాళిబొట్లు అందించారు.

టిడిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి నియోజక వర్గం లో యువ గళం పాదయాత్రను విజయ వంతం చేసినం దుకు గాను టిడిపి నియో జకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రూరల్ పార్టీ అధ్యక్షులు తోట పార్థసారథి, నియోజ వర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మిలను బుధవారం మంగళగిరి నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దానబోయిన సుందర్రావు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు వాక మాధవరావు, బి నాగరాజు, బి కోటేశ్వరరావు, సిహెచ్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



కెఎల్‌యులో ఘనంగా ఓనం వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఓనం వేడుకలు బుధవారం కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు సాంస్కృక కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని కేరళలో జరుపుకునే అతిపెద్ద పండుగ ఓనం అని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంత రావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, అసోసియేట్ డీన్, కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ రూత్ రమ్య, డాక్టర్ సోని, సిఎస్ఇ రెగ్యులర్ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్, సిఎస్ఇ హానర్స్ విభాగాధిపతి డాక్టర్ సెథిల్ మురగన్, డిప్యూటీ విభాగాధిపతి డాక్టర్ శాంతి శ్రీ పాల్గొన్నారు.

విజ్ఞాన్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈదర దీపక్ చౌదరికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ దీపక్ చౌదరి 'డిజైన్ ఆఫ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్స్ ఫర్ యాస్పెక్ట్ బేస్డ్ ఒపీనియన్ మైనింగ్ ఆన్ యూజర్ జెనరేటెడ్ కంటెంట్ ఇన్ ఎలక్ట్రానిక్ మీడియా' అనే అంశంపై పరిశోధన చేశారన్నారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని సీఎస్ఈ విభాగం డీన్, ప్రొఫెసర్ డాక్టర్ కేవీ క్రిష్ణకిషోర్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దీపక్ చౌదరిని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నాగభూషణ్, డీన్లు, విభాగాధిపతులు అభినందించారు.



దీపక్‌ను అభినందిస్తున్న వీసీ, తదితరులు

జిజిహెచ్‌లో కొనసాగుతున్న గుండె ఆపరేషన్‌లు

ప్రజావక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు గుండె ఆపరేషన్లు బుధవారం వైద్యులు విజయవంతం చేశారు. నగరంలోని గుండారావు పేటకు చెందిన గోన చార్లస్ కుమార్ (34), పిడుగురాళ్లకు చెందిన పి.కోటేశ్వరరావు (60) లకు డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే ఆధ్వర్యంలో డాక్టర్ కుప్పు స్వామి, డాక్టర్ ప్రభోద బృందం గుండె చికిత్స ఆపరేషన్ నిర్వహించారు. డాక్టర్ చంద్ర కుమార్, డాక్టర్ విజయలక్ష్మి, మత్తు వైద్యులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ రామరాజు పాల్గొన్నారు. రెండు గుండె శస్త్ర చికిత్సలు చేసిన వైద్య బృందానికి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ సీనియర్ వైద్యులను గోఖలే ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యులకు, జూనియర్ డాక్టర్లకు సరైన శిక్షణ, సూచనలు ఇస్తూ ప్రతిభవంతులుగా తీర్చిదిద్దాలని డాక్టర్ గోఖలేను కోరారు. డాక్టర్ గోఖలే వద్ద శిష్యరికం చెయ్యడం గొప్పగా భావించాలని సిటివిఎస్ వైద్యులకు ఆయన సూచించారు.

ఓటరు సర్వేను పరిశీంచిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : నూరు శాతం పారదర్శక ఓటర్ల జాబితా సిద్దం అయ్యేలా బిఎల్ఓలు అత్యాంత జాగ్రత్తగా ఓటర్ వెరిఫికేషన్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గం, పశ్చిమ నియోజకవర్గాల్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, అదనపు కమిషనర్ పెద్ది రోజాతో కలిసి స్పెషల్ సమ్మరీ రివిజన్-2024కి సంబంధించి తొలగించిన ఓటర్లు, ద్వంద ఓటర్లు , డెత్ కేసులు, క్రొత్త ఓటర్ల నమోదు వివరాలను జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఇంటింటికి వెళ్ళి ర్యాండమ్‌గా పరిశీలించారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎల్.ఐ.సి.కాలనీ, తుఫాన్‌నగర్, అశోక్ నగర్ ప్రాంతాల్లో, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొత్తపేట , గుంటూరువారితోట ప్రాంతాల్లో 2022 నుండి తొలగించిన ఓట్ల రీ వెరిఫికేషన్ వివరాలను జిల్లా కలెక్టర్ ఇంటింటికి వెళ్ళి స్వయంగా పరిశీలించి అర్జీదారులతో, ఓటర్లతో మాట్లాడారు. అధికారులు, సిబ్బంది పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాఖీలు కడుతున్న చిన్నారులు


సుమేథాలో రాఖీపండుగ

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధ హైస్కూల్లో బుధవారం రాఖీ పండుగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పండుగ ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం బాలురకు బాలికలతో రాఖీలు కట్టించి, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పాఠశాలల్లో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సుల నిర్వహణకు న్యాయ వాదులు, ఎంఇఒలు, ప్యారా లీగల్ వాలంటీర్లు, బాలల పరిరక్షణ అధికారులు తదితరులతో మూడు బృందాలతో ఏర్పాటు చేశారు. బుధవారం కాళిదాసుతో ఏర్పడిన బృందం ఆర్ అగ్రహారంలోని కెఎస్‌ఆర్‌పిహైస్కూల్, ఏటి అగ్రహారంలోని ఎస్‌కెబిఎం హైస్కూల్స్‌లో సదస్సులో ఏర్పాటు చేశారు. ఈ సదస్సుల్లో ప్యానల్ న్యాయవాది కట్టా కాళిదాసు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోని విద్యార్థులు మంచి లక్షణాలు అలవర్చుకొని, మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు. బాల బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ, స్నేహపూర్వక స్వభావం, దేశభక్తిపై అవగాహన కల్పించారు. బాల బాలికలు అవాంఛనీయ దాడులు, ఇబ్బందులకు గురైతే పాఠశాల ఉపాధ్యాయులకు వెంటనే తెలియపర్చాలని అన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రలోబాలకు గురి కాకుండా ఉండాలని, ఎవరికి వారు ఆత్మరక్షణ చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి టి.దుర్గాభవానీ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సమీర్, సిఆర్ఎఫ్ కోఆర్డినేటర్, ప్యారా లీగల్ వాలంటీరు మంగయ్య, యంఇఒ నాగేంద్రమ్మ, హెచ్ఎం పి.శ్రీనివాసరావు, శేషగిరిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాళిదాసు

రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఎస్.ఎస్.ఆర్- 2024 ఓటర్ల జాబితా రూపొందించేందుకు అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ, డిఆర్ఒ కే.చంద్రశేఖరరావుతో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో ఇంటింటికి ఓటరు కార్డుల వెరిఫికేషన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆప్ నాయకులు టి.సేవాకుమార్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, బిజెపి నాయకులు రాచమల్లు భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు బిళ్లా సునీల్, టిడిపి నాయకులు ఓంకార్, వైసిపి నుండి ఎ.జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు సర్వే పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా జిల్లా ఎన్నికల అధికారిగా తొలగించిన ఓట్లను తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో ర్యాండమ్‌గా పరిశీలించామని, మిగతా నియోజకవర్గాల్లోను పరిశీలించటం జరుగుతుందన్నారు. డిఆర్ఒ చంద్రశేఖర్‌రావు సీఈఓ ఆంధ్రా వెబ్‌సైట్‌లో క్లైయిమ్‌లను పరిశీలించే విధానాన్ని పార్టీల ప్రతినిధులకు వివరించారు. సమావేశంలో ఈఆర్వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, వెంకటశివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కార్డ్ ప్రైమ్ విధానాన్ని ఉపసహరించుకోవాలి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద దస్తావేజు లేఖరులు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం నూతనంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రవేశపెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0 విధానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఆర్ఒ దస్తావేజు లేఖరుల అధ్యక్షులు ఆళ్ల రామిరెడ్డి మాట్లాడుతూ కార్డ్ ప్రైమ్ 2.0 విధానం లోపభూయిష్టంగా, ప్రజలను అవస్థలకు గురి చేసే విధంగా ఉందని అన్నారు. సంఘం గౌరవాధ్యక్షులు మునగాల రవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఏకపక్షంగా కార్డ్ ప్రైమ్ 2.0ను అమలు చేయాలని నిర్ణయం తీసుకోవటం దారుణమన్నారు. నూతన విధానంలో ఆస్తి హక్కు కలిగిన వ్యక్తి ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకుండా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో బ్యాంకు రుణాలు పొందాలన్నా, క్రయ విక్రయాలు జరపాలన్నా అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను నకిలీ డాక్యుమెంట్లుగా సృష్టించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ కొనసాగుతున్న పాత రిజిస్ట్రేషన్ విధానంలో ఆస్తి క్రయ విక్రయాలు సాఫీగా సాగుతుండగా నూతన విధానంలో బయోమెట్రిక్ వినియోగం వల్ల నూతన టెక్నాలజీ సాయంతో యజమాని ఆస్తిని అక్రమార్కులు తీసుకునే ప్రమాదం ఉందన్నారు. అలాగే ఈపేమెంట్ ద్వారా స్టాంప్ డ్యూటీ ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారానే చేయాలనే నిబంధనల నిరక్షరాస్యులకు శాపంగా మారుతుందని చెప్పారు. కంప్యూటర్ పరిజ్ఞానం లేని గ్రామీణులకు నూతన రిజిస్ట్రేషన్ విధానం గుదిబండగా మారి, వారిని గందరగోళ పరుస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రజలకు సహాయకారులుగా ఉంటున్న లక్షలాది దస్తావేజు లేఖరుల కుటుంబాలు రోడ్డున పడతారన్నారు. కావున ప్రభుత్వం నూతన విధానాన్ని తొలగించి, పాత పద్దతినే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు పి.గోవర్ధన్, మెహమూద్, రౌతు రాము, ఆలపాటి సుధాకర్, కె.ప్రసాద్, కె.శ్రీనివాస్, శిరంశెట్టి మహేష్‌బాబు పాల్గొన్నారు.



గుంటూరులో నిరసన తెలియజేస్తున్న దస్తావేజు లేఖరులు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం దస్తావేజు లేకర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయుటకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేట దస్తావేజులు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో బుధ, గురువారం రెండు రోజులు పెన్ డౌన్ చేయుటకు మరియు రిజిస్ట్రేషన్లు నిలుపు చేయుటకు నిర్ణయం తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం డిజిటల్ ఆన్లైన్ విధానాన్ని తీసుకొచ్చి దస్తావేజు లేఖరుల పొట్టకొట్టే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తుందని ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని దస్తావేజ్ లేకర్లు డిమాండ్ చేశారు. నరసరావుపేట రిజిస్టర్ ఆఫీస్ ఎదుట దస్తావేజు లేఖరుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని చేపట్టిన పెన్ డౌన్ నిరసన కార్యక్రమం ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం వలన ప్రజల ఆస్తులకు భద్రత ఉండదన్నారు. డిజిటల్ విధానం కొనసాగితే రాష్ట్ర రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది దస్తావేజు లేఖరుల ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు. కావున ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని అన్నారు.



పల్నాడు జిల్లా నరసరావుపేటలో దస్తావేజు లేఖరుల నిరసన



తెనాలిలో



మంగళగిరిలో

ప్రజాశక్తి-తెనాలి : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ విదానానికి నిరసనగా దస్తావేజులేఖర్లు పెన్‌డౌన్ చేపట్టారు. తెనాలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యం సమీ పంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమ ంలో నాయకులు ఎన్.రాం బాబు, వై. పేరయ్య, జి.రాంబాబు, సీహెచ్ ప్రసాద్, వై.రవి కుమార్, జి.ద్వారకాశ్రీను, ఎం.రాజేంద్ర బాబు, టి.శ్రీధర్, బి.సురేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరిలో దస్తావేజులు లేఖరుల పెన్డౌన్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. సంఘం నాయకులు కే జయరాజ్, కే కిషోర్ , వై శివయ్య, ఏ అర్జున్, వి వెంకటరెడ్డి, ఏ బాలాజీ నాయక్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర : గతంలో లాగానే సబ్ రిజిస్టర్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగేలా చర్యలు తీసుకోవాలని దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు ఎర్రి కోటేశ్వరరావు కోరారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ కిషోర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు గంగాధర్, రమణ శర్మ ఉయ్యూరు మాధవరెడ్డి ఆళ్ళసామిరెడ్డి పాల్గొన్నారు.



కొల్లిపరలో